# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ ను అభివృద్ధి చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని మంత్రి పొంగురు నారాయణ స్పష్టం చేశారు.
- ❖ ఉద్యోగి స్థాయి నుండి ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.
- ❖ ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ రానున్న వారం రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కూరుస్తాయని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.

==============================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ ను 150 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ రోజు విశాఖపట్నంలోని జాలరి ఎండాడలో మంత్రి మత్ససంపద కృత్రిమ ఆవాసాలను ప్రారంభించారు. అనంతరం కేరళ రాష్ట్ర ప్రభుత్వ మత్స్య సంస్థతో సముద్ర నాచు అభివృద్ధి చేసే పక్రియకి సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... విదేశాలలో కృత్రిమ ఆవాసాలకు చాలా గిరాకీ ఉందని, విశాఖలో 3 కృత్రిమ ఆవాసాలను ప్రారంభించినట్లే.. రాష్ట్ర వ్యాప్తంగా 22 కృత్రిమ ఆవాసాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సముద్ర నాచు వల్ల 45 రోజుల్లోనే ఆదాయం వస్తుందన్నారు. మత్స్యశాఖ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

==============================

అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఆందోళన చెందనవసరం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగురు నారాయణ తెలిపారు. ఈ రోజు నెల్లూరులో నగర అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్టం లో 68 లక్షల రేషన్ కార్డులున్నాయని, నిబంధనలు ప్రకారం మాత్రమే అనర్హుల కార్డులను తొలగిస్తున్నామని, అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి ఎక్కడా ఆగడం లేదని, నెల్లూరు సిటీ నియోజకవర్గం అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రి తెలిపారు.

==============================

ఉద్యోగి స్థాయి నుండి ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ఈ రోజు కడప ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఏర్పాటు కానున్న "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఇంటి నుండి ఒక అంకుర సంస్థ రూపుదిద్దుకోవాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనున్న కడప స్టార్ట్ అప్ కేంద్రం యువ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తుందని వ్యాఖ్యానించారు. కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేదిశగా ఈ స్టార్టప్ కేంద్రం కీలక పాత్ర పోషించనుందని మంత్రి ఎస్.సవిత తెలియజేశారు.

==============================

ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రక్త సంబంధిత వ్యాధులపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని విజయవాడలో ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో 1,900 మంది హిమోఫీలియా, 2,100 మంది తలసీమియా బాధితులున్నారని, వారికి క్రమం తప్పకుండా ఉచితంగా రక్త మార్పిడి చేస్తున్నమని వెల్లడించారు. తలసేమియా భదితులకు పింఛను సౌకర్యం కల్పించడంపై మరింత దృష్టి పెడతామని తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో దేశంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్ర స్థానంలో నిలపాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

==============================

పార్వతీపురం మన్యం జిల్లాలో "పీఎం జన్ మన్" పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. పీఎం జన్ మన్, పీఎం సూర్య ఘర్ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, లబ్దిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో రహదారుల నిర్మాణం, చెక్ డ్యామ్ పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు మేరకు జిల్లాలో న్యాయస్థానాల్లో తాగునీరు వంటి కనీస మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

==============================

"ఆపరేషన్ సిందూర్" విజయవంతమవడంలో తమ పోరాట పటిమను చూపిన భారత సాయుధ దళాలకు సంఘీభావంగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో

అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన పరమ వీర చక్ర అవార్డు గ్రహీత లెఫ్టినెంట్ మనోజ్ కుమార్ పాండే గురించి ఈ రోజు తెలుసుకుందాం.

(వాయిస్ 40 సెకన్లు)

==============================

ఈ సంవత్సరం ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటి వనరుల, ప్రాజెక్టు ల నిర్వహణ మరమ్మతులు పూర్తయ్యే లక్ష్యంగా పనులను చేపట్టాలని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ అధికారులు, శాసనసభ్యులతో ఈ రోజు ఆయన శ్రవణమాధ్యం ద్వారా సమీక్ష నిర్వహించారు. జలవనరుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన 344 కోట్ల రూపాయలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

==============================

కృష్ణా నదీ జలాలను కాపాడుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని జల బిరాదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ రోజు విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కృష్ణానది సుమారు 1,400 కిలో మీటర్ల మేర ప్రయాణిస్తుందని, ఈ నెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకూ నదులను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. భవిష్యత్ తరాలకు కృష్ణానది నుంచి సురక్షితమైన మంచినీటిని అందించటమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు.

==============================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో విద్యారంగంలో అభివృద్ధి జరుగుతోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ రోజు వెలగపూడి సచివాలయంలోని డీఎస్సీ ట్రై మెథడ్స్ మెటీరియల్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సమాజాభివృద్ధిలో విద్యారంగానిది కీలకపాత్ర అని, ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగానికి పునర్వైభవం వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

==============================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి మైసూరు రాజమాత ప్రమోదాదేవి 2 భారీ వెండి అఖండ దీపాలను ఈ రోజు విరాళంగా అందజేశారు. రంగనాయకుల మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఆలయ అధికారులకు వాటిని అందించారు.

==============================

రానున్న వారం రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కూరుస్తాయని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమ భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రానున్న 24 గంటలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా... అనంతపురం, వైఎస్సార్ కడప, సత్యసాయి, అన్నమయ్య, బాపట్ల, నంద్యాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జరీ చేసింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగతం ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

==============================
==============================